RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము. జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006
9494220260

ప్రతి అక్షరం ప్రజాహితం ఆంధ్రప్రగతి తెలుగు దినపత్రిక

సంపుటి - 01 సంచిక - 283 పేజీలు - 04 వెల - 05/- ఎడిటర్ : సి యం శ్రీనివాస్

మంగళవారం 18 జూన్ 2024

# జగన్ శాపం వల్లనే పోలవరానికి ఈ దుస్థితి ..!



**-జగన్ రాజకీయాలలో ఉండదగిన వ్యక్తి కాదు.!**

**-ఏపీ సీఎం చంద్రబాబు సంచలన వ్యాఖ్యలు.**



ఆంధ్ర ప్రగతి పోలవరం జూన్ 17: ఆంధ్రప్రదేశ్ నూతన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు పోలవరం ప్రాజెక్ట్‌ను సందర్శించారు. హెలికాప్టర్ నుంచే ఆయన స్పిల్‌వే సహా పలు ప్రాంతాలను పరిశీలించారు.ప్రాజెక్ట్ దగ్గరకు చేరుకున్న వెంటనే పనుల పురోగతి గురించి చంద్రబాబు.. అధికారులతో సమీక్షించారు. పనులు ఎంతవరకు వచ్చాయి. ఎలా సాగుతున్నాయి అని జలవనరుల శాఖ అధికారులను అడగారు. అనంతరం ప్రాజెక్ట్ స్థితి గతులు, జరిగిన పనుల గురించి అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి చర్చించారు. ఈ చర్చలో మంత్రి నిమ్మల రామానాయుడు సహా పలువురు ఎమ్మెల్యేలు కూడా పాల్గొన్నారు. సమావేశం అనంతరం మాట్లాడిన చంద్రబాబు.. వైఎస్ జగన్, ఆయన ప్రభుత్వంపై మండిపడ్డారు. రాష్ట్రానికి జగన్ ఒక శాపమని, వారి ప్రభుత్వం ఒక పీడ అంటూ ఆగ్రహంతూ ఊగిపోయారు.ఆంధ్ర ప్రదేశ్‌కు జీవనాడి లాంటి పోలవరం ప్రాజెక్ట్ ఇప్పుడు సంక్షోభాల ప్రాజెక్ట్‌లా తయారయిందని ఆవేదన వ్యక్తం చేశారు

మిగతా 4లో



## వైసీపీకి మాజీ మంత్రి సిద్ధ రాజీనామా.!



ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 17 : వైఎస్సార్సీపీకి మరో షాక్ తగిలింది. ఆ పార్టీకి మాజీ మంత్రి శిద్దా రాఘవరావు రాజీనామా చేశారు. ఈ మేరకు వైసీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు తన రాజీనామా లేఖను పంపారు.వ్యక్తిగత కారణాల వల్ల తాను రాజీనామా చేస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో తన రాజకీయ భవిష్యత్ ప్రకటిస్తానని శిద్దా రాఘవరావు తెలిపారు.కాగా, శిద్దా రాఘవరావుది ప్రకాశం జిల్లా. వ్యాపారవేత్తగానూ ఆయన రాణించారు. టీడీపీ నుంచి 2014లో పోటీచేసి శిద్దా రాఘవరావు తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచారు. ఆయనకు చంద్రబాబు నాయుడు మంత్రి పదవి ఇచ్చారు. అప్పట్లో ఆయన అటవీ శాఖతో పాటు పర్యావరణం, సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖల మంత్రిగా చేశారు.ప్రకాశం జిల్లా దర్శి నుంచి 2014లో పోటీ చేసిన ఆయన గెలిచారు. 2019 ఎన్నికల్లో దర్శి నియోజక వర్గం నుంచి వైసీపీ నుంచి పోటీచేసి మద్దిశెట్టి వేణుగోపాల్ గెలిచారు. 2019లో శిద్దా రాఘవరావు ఒంగోలు అసెంబ్లీ నుంచి కాకుండా ఎంపీగా పోటీ చేశారు. అప్పట్లో వైసీపీ అభ్యర్థి మాగుంట శ్రీనివాసులరెడ్డి చేతిలో ఆయన ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో దర్శి నియోజక వర్గం నుంచి బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి విజయం సాధించిన విషయం తెలిసిందే. కాగా, శిద్దా రాఘవరావు 2006లో శ్రీశైలం ట్రస్ట్ బోర్డ్ చైర్మన్‌గానూ నియమితుడయ్యాడు.

## అసెంబ్లీ స్పీకర్ గా అయ్యన్న..!



ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 17: ఏపీ అసెంబ్లీ సమావేశాలు బుధవారం నుండి ప్రారంభంకానున్న సంగతి తెలిసిందే. ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారంతో పాటు స్పీకర్, డిప్యూటీ సీఎం ఎన్నిక జరగనుండగా స్పీకర్ పదవి టీడీపీకి, జనసేనకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇచ్చే అవకాశం ఉంది.టీడీపీ వర్గాల నుండి అందుతున్న సమాచారం ప్రకారం అసెంబ్లీ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడి ఎంపిక దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. ఇక డిప్యూటీ సీఎం పదవికి జనసేన నుండి ద్దరు నేతలు పోటీ పడుతున్నారు. ప్రధానంగా బొలిశెట్టి, మండలి బుద్ధప్రసాద్ పేర్లు వినిపిస్తున్నాయి.మొదట ప్రొటెం స్పీకర్‌గా సీనియర్ నాయకుడు ఉండనుండగా ఆయన ఎమ్మెల్యేలతో ప్రమాణస్వీకారం చేయించనున్నారు. అనంతరం స్పీకర్, డిప్యూటీ స్పీకర్ ఎంపిక జరుగుతుంది. ఇప్పటికే మంత్రివర్గంలో జనసేనకు సముచిత స్థానం కల్పించారు చంద్రబాబు. పవన్‌కు డిప్యూటీ సీఎం పదవిని కట్టబెట్టగా తాజాగా డిప్యూటీ స్పీకర్ పదవి కూడా జనసేనకే కేటాయిస్తున్నట్లు సమాచారం.

## జూన్ 24 నుండి ఏపీ అసెంబ్లీ సమావేశాలు




ఆంధ్ర ప్రగతిఅమరావతి జూన్ 17: ఏపీలో కొత్త ప్రభుత్వం ఏర్పడ్డాక తొలి శాసన సభ సమావేశాలకు ముహూర్తం ఖరారైంది. ఈ నెల 24 నుంచి ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి.24, 25, 26 తేదీల్లో 3 రోజులపాటు సమావేశాలు జరగనున్నాయి. 24న ప్రొటెం స్పీకర్‌ని ఎన్నుకున్న తర్వాత కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలు ప్రమాణ స్వీకారం చేయనున్నారు. తొలుత ప్రొటెం స్పీకర్‌తో రాజ్‌భవన్‌లో గవర్నర్ నజీర్ ప్రమాణం చేయించనున్నారు.

# తెలంగాణ గవర్నర్ గా నల్లారి కిరణ్ కుమార్ రెడ్డి.!



ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 17: ఈ ఎన్నికల్లో మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి ఓడిపోయారు. రాజంపేట పార్లమెంట్ స్థానం నుంచి బిజెపి అభ్యర్థిగా పోటీ చేసిన ఆయన పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి చేతిలో 76 వేల ఓట్లతో ఓటమి చవిచూశారు.బిజెపి నుంచి ఆరుగురు పోటీ చేయగా.. ముగ్గురుకి ఓటమి ఎదురైంది. అందులో కిరణ్ కుమార్ రెడ్డి ఒకరు. అయితే రాజంపేట నియోజకవర్గం క్రిటికల్ అని తెలిసినా కిరణ్ రంగంలోకి దిగారు. అయితే ఆయన ఓడిపోయినా కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చింది. ఏపీలో కూటమి ప్రభుత్వం విజయం సాధించింది. అటు సోదరుడు కిషోర్ ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే ఇటువంటి తరుణంలో కిరణ్ కుమార్ రెడ్డి సేవలను వేరే విధంగా వినియోగించుకోవాలని బిజెపితో పాటు చంద్రబాబు భావిస్తున్నారు. చిత్తూరు జిల్లాలో నల్లారి కుటుంబానికి ప్రత్యేక రాజకీయ నేపథ్యం. సుదీర్ఘకాలం ఆ కుటుంబం కాంగ్రెస్ పార్టీలోనే కొనసాగింది. తండ్రి వారసత్వంగా రాజకీయాల్లోకి వచ్చిన కిరణ్ పలుసార్లు కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేగా గెలిచారు. కానీ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చెక్ చెప్పడంతో ఎప్పుడూ మంత్రి పదవి దక్కలేదు. రాజశేఖర్ రెడ్డి రెండోసారి అధికారంలోకి వచ్చిన తరుణంలో.. అనూహ్యంగా స్పీకర్ పదవి కిరణ్ కుమార్ రెడ్డికి వరించింది. 2010లో రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో రోశయ్య సీఎం అయ్యారు. కొద్ది రోజులకే ఆయనను మార్చి స్పీకర్ గా ఉన్న కిరణ్ కుమార్ రెడ్డికి కాంగ్రెస్ హై కమాండ్ అవకాశం ఇచ్చింది. మూడేళ్ల పాటు ఉమ్మడి రాష్ట్రానికి సీఎంగా కిరణ్ వ్యవహరించారు. ఉమ్మడి ఏపీకి ఆయనే చివరి సీఎం.రాష్ట్ర విభజనతో కాంగ్రెస్ పార్టీతో విభేదించారు కిరణ్ కుమార్ రెడ్డి. సమైక్యాంధ్ర పార్టీని స్థాపించారు. 2014ఎన్నికల్లో పోటీ చేశారు. ఒక్క స్థానాన్ని కూడా గెలవలేకపోయారు. అయితే ఓట్లు చీల్చి వైసిపి ఓటమికి కారణమయ్యారు. అక్కడ నుంచి పొలిటికల్ గా సైలెంట్ అయ్యారు. 2019 ఎన్నికల్లో సైతం కనిపించలేదు. కానీ ఈ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీలో తిరిగి చేరారు. కానీ ఎక్కువ రోజులు అక్కడ ఇమడ లేకపోయారు. బిజెపి హై కమాండ్ పెద్దల పిలుపు మేరకు ఆ పార్టీలో చేరారు. ఏపీలో పొత్తుల్లో భాగంగా రాజంపేట ఎంపీ స్థానం నుంచి పోటీ చేశారు. వైసీపీ అభ్యర్థి మిధున్ రెడ్డికి గట్టి పోటీ ఇచ్చారు. అయితే అటు కేంద్రంలో బిజెపి అధికారంలోకి రావడం, ఇటు కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో విజయం సాధించడంతో కిరణ్ కు మంచి ఛాన్స్ ఇవ్వాలని కేంద్ర పెద్దలు భావిస్తున్నారు. కిరణ్ విషయంలో చంద్రబాబు సైతం సుముఖంగా ఉండడంతో ఆయన పేరును గవర్నర్ పోస్ట్ కు పరిశీలిస్తున్నట్లు సమాచారం. ఉమ్మడి రాష్ట్రంపై కిరణ్ కు మంచి పట్టు ఉంది. ప్రస్తుతం తెలంగాణ గవర్నర్ గా ఉన్న తమిళ సై తిరిగి రాజకీయాల్లో ప్రవేశించారు. తమిళనాడు రాజకీయాల్లో యాక్టివ్ అయ్యారు. తెలంగాణలో బిజెపి ఎనిమిది ఎంపీ సీట్లను గెలుచుకుంది. ఈ తరుణంలో రాష్ట్రంపై సమగ్ర అవగాహన ఉన్న కిరణ్ కుమార్ రెడ్డి గవర్నర్ అయితే బిజెపికి తప్పకుండా ప్రయోజనం చేకూరుతుంది. అందుకే కిరణ్ పేరు ఖరారు చేసినట్లు సమాచారం. మరి ఏం జరుగుతుందో చూడాలి.

## జగన్ పై ప్రేమ ఉంటే పోలీస్ ఉద్యోగానికి రాజీనామా చేయండి.!

**-హెూం శాఖ మంత్రి వంగలపూడి అనిత సంచలన వ్యాఖ్యలు.**

2లో







# జగన్ రాజకోట రహస్యం బట్టబయలు.!

**-పేదల ప్రతినిధిగా డప్పు కొట్టుకునే మాజీ సీఎం జగన్‌పెత్తందారీ భవంతులు కట్టేశారు.**
**-లక్షా 41 వేలకు పైగా చదరపు అడుగుల్లో అత్యంత విలాసవంతమైన భవనాలు నిర్మించుకున్నారు.**
**-ప్యాలెస్‌లను తలదన్నేలా ఉన్న ఆ నిర్మాణాల వెలుపల, లోపల ఉన్న విలాసాలను చూస్తే కళ్లు తిరగాల్సిందే.**
**-పేదలకు సెంటు భూమి విదిల్చి ఆయన మాత్రం ప్రజాధనంతో రాజకోట నిర్మించుకున్నారు.**

ఆంధ్ర ప్రగతి విశాఖపట్నం జూన్ 17:
అణువణువునా పెత్తందారీ మనస్తత్వాన్ని పుణికిపుచ్చుకుని, తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమాస్తులు సంపాదించారు. వాటితో ఊరూరా ప్యాలెస్‌లు నిర్మించుకున్నా సంతృప్తి చెందని జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో విజయవంతంగా పూర్తిచేసిన ఏకైక ప్రాజెక్టు రుషికొండపై తన కోసం రాజభవనాల్ని తలపించేలా అత్యంత విలాసవంతమైన ప్యాలెస్‌లు మరిన్ని కట్టుకోవడం.! రుషికొండపై భవనాల్ని ఈసారి ఆయన అక్రమాస్తుల డబ్బుతో కట్టలేదండోయ్.! ఆ ఆస్తులన్నీ భద్రంగా దాచుకుని వందల కోట్ల రూపాయల ప్రజల సొమ్మును మంచినీళ్లలా ఖర్చుపెట్టేశారు.
ఏకంగా 452 కోట్ల రూపాయలతో విలాసవంతమైన నివాస, కార్యాలయ భవనాలు ఏడింటిని బ్రహ్మాండంగా కట్టేశారు. వాటిలో ప్రత్యేకంగా నివాస భవనాలే మూడు ఉన్నాయి. వాటిలో పడక గదులు పన్నెండు! ప్రతీ పడక గదినీ అనుసంధానిస్తూ అత్యంత విలాసవంతమైన స్నానాల గదులు నిర్మించారు. ఆ స్నానాల గదుల్ని చూస్తేనే సామాన్యులకు కళ్లు తిరుగుతాయి. నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ, నా మైనారిటీ అంటూ వారిపై ఐదేళ్లూ తెగ ప్రేమ నటించిన జగన్ వారికి ఇళ్ల నిర్మాణానికి ఇచ్చింది సెంటు భూమి.! దానిలో గరిష్ఠంగా 430 చదరపు అడుగుల ఇల్లు కట్టుకోగలరు. కానీ జగన్ బాత్రూం వైశాల్యమే 480 చదరపు అడుగులు.! అంటే పేదల ఇళ్లు జగన్ బాత్రూం అంత కూడా లేవన్న మాట.!
రుషికొండపై భవనాలకు 452 కోట్ల అంచనా వ్యయంలో ఇప్పటికే 407 కోట్లు ఖర్చు పెట్టేశారు. అవన్నీ సర్వ హంగులు, ఖరీదైన అంతర్గత అలంకరణలతో ఇప్పటికే సిద్ధమైపోయాయి. అత్యంత ఖరీదైన ఫర్నిచర్ కూడా చాలా వరకు తెచ్చేశారు. మళ్లీ తానే గెలుస్తానని, ముఖ్యమంత్రిగా 30ఏళ్లపాటు తానే ఉంటానని జగన్ కన్న కలలన్నీ కల్లలైపోయాయి. కానీ రాజధానిని విశాఖకు మార్చేసి, రుషికొండపై కొలువు తీరాలనుకున్న జగన్ కుట్రపూరితంగా భారీ విధ్వంసానికి తెగబడ్డారు.రుషికొండపై గతంలో పర్యాటకశాఖ నిర్మించిన, చక్కగా, దృఢంగా ఉన్న భవనాల్ని కూలగొట్టారు. రిసార్టులు కడుతున్నామన్న పేరుతో సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకుని అక్కడ జగన్ నివాసానికి, సీఎం కార్యాలయానికి భవంతులు కట్టేశారు. అక్కడ సీఎం కోసం నివాస, కార్యాలయ భవనాల్ని కడుతున్నా అప్పటి మంత్రులు బొత్స సత్యనారాయణ, గుడివాడ అమర్నాథ్, రోజా, అధికారులు మాత్రం అవి రిసార్టులేనని బుకాయిస్తూ వచ్చారు. చివరిగా మరో నాటకానికి తెరతీశారు. వారి కోటరీలో కీలకంగా వ్యవహరించిన ఐఏఎస్ అధికారి శ్రీలక్ష్మితో ఒక కమిటీ వేసి, రుషికొండపై భవనాలు ముఖ్యమంత్రి నివాసానికి అనుకూలమని సిఫార్సు చేయించారు.ఆమె ఆధ్వర్యంలోని కమిటీ విశాఖలో అన్ని భవనాలూ పరిశీలించిందని, చివరకు రుషికొండపై కట్టిన భవనాలే సీఎం నివాసానికి అనుకూలమని గుర్తించినట్టు పెద్ద డ్రామా పండించారు. వాటిలో కొన్ని మార్పులు చేస్తే సీఎం నివాసానికి, కార్యాలయానికి చక్కగా సరిపోతాయని ఆమెతో చెప్పించారు. అదంతా పెద్ద డ్రామా.! వాటిలో ఏ మార్పులూ చేయక్కర్లేదు. నేరుగా వెళ్లి వాటిలో ఉండొచ్చు. కానీ వైఎస్సార్సీపీ వాళ్లు ఒకటి తలిస్తే ప్రజలొకటి తలిచారు. ఈ ఎన్నికల్లో గట్టిగా బుద్ధి చెప్పి ఇంటికి సాగనంపారు.రుషికొండపై అత్యంత రహస్యంగా నిర్మాణాలు సాగించిన జగన్ ప్రభుత్వం అధికారంలో ఉన్నన్నాళ్లూ అనుమతి లేకుండా అక్కడికి చీమనూ చొరబడనివ్వలేదు. ప్రతిపక్ష నాయకులు అక్కడికి వెళ్లేందుకు ప్రయత్నిస్తే వందల మంది పోలీసుల్ని మోహరించి అడ్డుకుంది. మాజీ మంత్రి, భీమిలి శాసనసభ్యుడు గంటా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో టీడీపీ నాయకుల బృందం, మీడియా ప్రతినిధుల్ని తీసుకుని ఆదివారం రుషికొండ భవనాల్ని సందర్శించడంతో మొత్తం రహస్యం బట్టబయలైంది. రూ.400 కోట్లకు పైగా ప్రజాధనాన్ని వెచ్చించి, దర్పం ఉట్టిపడేలా అత్యంత విలాసవంతంగా నిర్మించిన ఆ భవనాల్ని చూసినవారికి కళ్లు చెదిరిపోయాయి.
అంతెత్తున శ్వేతవర్ణంతో మెరిసిపోతున్న భవంతులు, భారీ ప్రవేశద్వారాలు, విశాలమైన పడకగదులు, వాటికి ఏ మాత్రం తీసిపోని విధంగా స్నానాల గదులు, అత్యంత ఖరీదైన మంచాలు, పరుపులు, బాత్ టబ్‌లు, కళ్లు మిరుమిట్లు గొలిపే షాండ్లియర్లతో మెరిసిపోయే ఆ వైభోగాన్ని కళ్లారా చూడాల్సిందే తప్ప వర్ణించలేం. ఏ వైట్‌హౌస్ లోపలికో, బకింగ్‌హాం ప్యాలెస్ లోపలికో అడుగుపెట్టిన అనుభూతి కలుగుతుంది. వాటిలో అంతర్గత అలంకరణల కోసం ఏకంగా 13 వందల 12 రకాల వస్తువులు వినియోగించారు. ఇక ఆ భవనాలకు వెలుపల ఖరీదైన పచ్చికతో విశాలమైన లాన్‌లు, సుందరమైన ఉద్యానవనాల్ని తీర్చిదిద్దారు. నివాస భవనాల్లోంచి చూస్తూ కనుచూపు మేరలో విశాలమైన నీలిసముద్రం సోయగాలు కనిపించేలా డిజైన్లు తీర్చిదిద్దారు.రుషికొండపై టూరిజం రిసార్టు ముసుగులో జగన్ కోసం కుట్రపూరితంగా కట్టిన నివాస, కార్యాలయ భవనాలకు ప్రజాధనాన్ని యథేచ్ఛగా, లెక్కలేనితనంతో ఖర్చుపెట్టేశారు. రుషికొండపై కడుతున్నది రిసార్టేనని వైఎస్సార్సీపీ నాయకులు చివరి వరకు బుకాయించారు. అది పర్యాటకుల కోసం కట్టినదైతే 7 వేల 266 చదరపు మీటర్ల వైశాల్యం గల భారీ కార్యాలయ భవనాలు నిర్మించాల్సిన అవసరమేంటి? కళింగ బ్లాక్‌లోని రెండు భవనాలను కార్యాలయాల కోసమే నిర్మించారు. మొదటి అంతస్తు వరండాలో ఏర్పాటుచేసిన షాండ్లియర్ ఖరీదే 2 లక్షలని చెబుతున్నారు. అలాంటివి ఆ ఒక్క వరండాలోనే పది వరకు ఉన్నాయి. భవనం మొత్తంలో చాలానే ఉన్నాయి.అంతర్గత అలంకరణ వస్తువులు, ఫర్నిచర్ కోసమే సుమారు 33 కోట్ల రూపాయలు వెచ్చించారు. రోడ్లు, కాలువలు, పార్కుల అభివృద్ధికి మరో 50 కోట్ల వరకు ఖర్చుచేశారు. ఆరుబయట సుందరమైన ల్యాండ్‌స్కేపింగ్ చేశారు. పార్కులో 2-3 రకాల నడకమార్గాలు ఏర్పాటు చేశారు. రుషికొండపై రిసార్టు పేరుతో ప్రభుత్వం ఆడిన డ్రామాలో ఐదారుగురు ఐఏఎస్ అధికారులూ కీలకపాత్ర పోషించారు. పర్యాటకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న రజత్‌భార్గవ పాత్ర ఎక్కువగా ఉన్నట్టు సమాచారం. అయితే ప్రభుత్వం మారి, రుషికొండ వ్యవహారంపై విచారణ జరిపిస్తే తమ మెడకు చుట్టుకోకుండా అధికారులు ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకున్నారు.
ప్రభుత్వం కనుసన్నల్లోనే మొత్తం కథ నడిపించినా ప్రాజెక్టుకు సంబంధించిన ప్రతి దశలోనూ కేబినెట్ అనుమతి తీసుకున్నారు. జగన్‌కు ఇప్పటికే బెంగళూరు, హైదరాబాద్, పులివెందుల, తాడేపల్లి ఇలా ఊరూరా రాజభవనాల్ని తలదన్నే భవంతులున్నాయి. బెంగళూరు, హైదరాబాద్ వంటిచోట్ల జగన్ నిర్మించుకున్న ప్యాలెస్‌లు డొల్ల కంపెనీల పేరుమీద ఉన్నట్టు ఆరోపణలున్నాయి. హైదరాబాద్‌లోని లోటస్‌పాండ్ వద్ద 5 వేల 807 చదరపు గజాల్లో 88 వేల 458 చదరపు అడుగుల భవన నిర్మాణం కోసం 4 డొల్ల కంపెనీలు పుట్టించినట్టు ఈడీనే నిగ్గుతేల్చింది.

## మెగా డీఎస్సీలో దివ్యాంగ విద్యార్థులకు ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి

ఆంధ్ర ప్రగతి మంగళగిరి జూన్ 17:
ఇటీవల నూతన రాష్ట్ర ప్రభుత్వంతో ప్రమాణస్వీకారం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల ముందు ఇచ్చిన హామీల మేరకు మొట్టమొదటి సంతకంతో ప్రవేశపెట్టిన మెగా డీఎస్సీలో ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని సామాజిక కార్యకర్త,ల్యాంప్ స్వచ్ఛంద సేవా సంస్థ,ఆంధ్ర ప్రదేశ్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ బడుగు సుబ్బాయమ్మ కోరారు. సోమవారం ఆమె ఆలమూరు మండలంలోని విలేకరులతో మాట్లాడుతూ గత 24 సంవత్సరాల నుండి ఆమె చేస్తున్న సేవా కార్యక్రమాల్లో భాగంగా పాఠశాలల్లో బోధన విషయంలో రాష్ట్రంలో ఉన్న దివ్యాంగ విద్యార్థులు పడుతున్న అనేక ఇబ్బందులను చాలా దగ్గర నుండి చూసానని,పాఠశాలలో వారి నిమిత్తం



ప్రత్యేక ఉపాధ్యాయులు ఎవరు లేరని,దివ్యాంగ పిల్లలు సమ్మిళిత విద్యకు తగు సౌకర్యాలు లేక విద్యకు దూరమై,మానసిక ఇబ్బందులకు గురవుతూ విద్యా ప్రగతిని భవిష్యత్తును కోల్పోతున్నారన్నారు. ఎన్.ఈ.పి(న్యూ ఎడ్యుకేషన్ పాలసీ) 2020 ప్రకారం ప్రతి పాఠశాలలో ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించవలసి ఉన్నది కాబట్టి మెగా డీఎస్సీలో ప్రత్యేక పోస్టులను కేటాయించాలని ఆమె రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. దీనితో దివ్యాంగ విద్యార్థులకు బంగారు భవిష్యత్తును ఏర్పాటు చేసిన వారు అవుతారని ఆమె సూచించారు.ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ నిరుద్యోగ ప్రత్యేక ఉపాధ్యాయుల ఫెడరేషన్ (ఏపీయుఎస్టిఎఫ్) ద్వారా బడుగు మహిమ రావు, మల్లిడి సాయి లక్ష్మి, రవి ప్రసాద్ కలిసి నేడు మంగళగిరిలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో పాల్గొని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ను కలిసి ప్రత్యేక అవసరాలు గల దివ్యాంగ విద్యార్థుల సమస్యలను వివరించారు.అయితే వారి నిమిత్తం స్పెషల్ ఎడ్యుకేషన్ చేసి ప్రత్యేక పోస్టులు కొరకు ఎదురుచూస్తున్నట్లు వారు తెలియజేసి వినతి పత్రాన్ని అందజేశారు.ఆయన సానుకూలంగా స్పందించి తగిన ఏర్పాట్లు చేస్తామని హామీ ఇచారన్నారు.

## జగన్ పై ప్రేమ ఉంటే పోలీస్ ఉద్యోగానికి రాజీనామా చేయండి.!

**-హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత సంచలన వ్యాఖ్యలు.**

ఆంధ్ర ప్రగతి సింహాచలం జూన్ 17:
రాష్ట్రంలోని ప్రజలందరికీ మంచి జరగాలని సింహాద్రి అప్పన్న స్వామిని కోరుకున్నానని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత తెలిపారు. సింహాచలంలో స్వామి వారిని ఆమె దర్శించుకున్నారు. అనంతరం అనిత మీడియాతో మాట్లాడారు. మంత్రి పదవి వచ్చిన తర్వాత అప్పన్న స్వామిని దర్శించుకోవాలని ఇక్కడికి వచ్చానని తెలిపారు. సింహాచలం దేవస్థానం భూములు ఒక్క గజం కూడా అన్యాక్రాంతం కాకుండా చూస్తానన్నారు. పంచగ్రామాల భూ సమస్యకు త్వరలోనే పరిష్కారం లభిస్తుందని చెప్పారు.వైకాపా ప్రభుత్వంలో కొంతమంది పోలీసు అధికారులు ఆ పార్టీ నేతలకు తొత్తులుగా పనిచేశారని అనిత విమర్శించారు. ఇప్పటికీ వారిలో వైకాపా రక్తం ప్రవహిస్తున్నట్లు వ్యవహరిస్తున్నారన్నారు. జగన్‌పై ఇంకా ప్రేమ ఉంటే ఉద్యోగానికి రాజీనామా చేసి ఆ పార్టీ కోసం పనిచేసుకోవాలని హితవు పలికారు. శాంతిభద్రతల విషయంలో ఎవరు తప్పుచేసినా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. ముఖ్యంగా మహిళలకు అన్యాయం జరగకుండా చూస్తానని తెలిపారు.
విశాఖ పోలీసు ఉన్నతాధికారులతో హోంమంత్రి అనిత సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ "వైకాపా పాలనలో రాష్ట్రాన్ని గంజాయి, డ్రగ్స్ హబ్‌గా మార్చారు. కనీసం పోలీస్‌స్టేషన్ల నిర్వహణకు కూడా నిధులు ఇవ్వలేదు. గంజాయి అణచివేతకు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేస్తాం. విశాఖలోనే గంజాయి అక్రమ రవాణాపై 1252 మందిపై కేసులు నమోదయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి 300 మందిపై కేసులున్నాయి. గంజాయి నివారణకు ప్రజా సహకారం కూడా కావాలి. ప్రజలకు మంచి చేసే దృక్పథంతో పోలీసులు ఉండాలి. మూడు నెలల్లోనే వ్యవస్థను గాడిలో పెడతాం. పోలీసు శాఖలో భారీ స్థాయిలో ప్రక్షాళన ఉంటుంది." అని తెలిపారు.

## ఏపీ ప్రోటెమ్స్ స్పీకర్ గా గోరంట్ల..?

ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 17:
ఆంధ్ర ప్రదేశ్‌లో ఇప్పుడు ప్రోటెమ్ స్పీకర్ పదవి చర్చనీయాంగా మారింది. 2024 ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ఏర్పడటం, నాలుగో సారి ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు, ఇతర మంత్రుల ప్రమాణ సీకారం కూడాఅయిపోయింది.మంత్రులకు శాఖల నియామకాలు కూడా పూర్తి అయ్యాయి. మంత్రులు బాధ్యతలు తీసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ప్రోటెం స్పీకర్‌గా ఎవరికి అవకాశం కల్పిస్తారనేది కూటమి శ్రేణుల్లో ఆసక్తికర చర్చగా మారింది.సహజంగా సీనియర్ సభ్యులకు ప్రోటెం స్పీకర్‌గా అవకాశం కల్పిస్తారు. 2014లో సీనియర్ సభ్యులైన పతివాడ నారాయణ స్వామి, 2019లో సీనియర్ సభ్యులైన శంబంగి వెంకట చిన్న అప్పలనాయుడు ప్రోటెం స్పీకర్‌లుగా వ్యవహరించారు. ఈ లెక్కన చూస్తే ప్రస్తుతం ఇద్దరు సీనియర్ ప్రోటెం స్పీకర్ రేస్‌లో ఉన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తర్వాత గోరంట్ల బుచ్చయ్య చౌదరి, చింతకాయల అయ్యన్నపాత్రుడు అందరి కంటే సీనియర్ సభ్యులుగా ఉన్నారు. వీరిద్దరిలో ఒకరికి ప్రోటెం స్పీకర్‌గా నియమించే అవకాశం ఉంది.గోరంట్ల బుచ్చయ్య చౌదరి తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి టీడీపీలో కొనసాగుతున్నారు. ఏడు పర్యాయాలు బుచ్చయ్య చౌదరి ఎమ్మెల్యేగా గెలుపొందారు. తొలి సారి 1983లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. తర్వాత 1985, 1994, 1999, 2014, 2019, 2024లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. గతంలో 1987లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడిగా పని చేసిన బుచ్చయ్య చౌదరి 1994లో ఎన్టీఆర్ మంత్రి వర్గంలో మంత్రి గా కూడా పని చేశారు. రాష్ట్ర విభజన తర్వాత ఏర్పడిన చంద్రబాబు ప్రభుత్వంలో మంత్రి పదవి దక్కుతుందని ఆశించారు. తాజాగా కొలువు దీరిన కూటమి ప్రభుత్వంలోనైనా మంత్రిగా చాన్స్ వస్తుందని ఎదురు చూశారు. కానీ చంద్రబాబు అవకాశం కల్పించ లేదు.రేస్‌లో ఉన్న మరో నేత చింతకాయల అయ్యన్నపాత్రుడు కూడా సీనియర్ సభ్యుడే. ఈయన కూడా టీడీపీ ఆవిర్భావం నుంచి ఉన్నారు. ఏడు పర్యాయాలు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1983 నుంచి గెలుపొందిన అయ్యన్నపాత్రుడు 1985, 1994, 1999, 2004, 2014, 2024లో ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఎన్టీఆర్, చంద్రబాబు నాయుడు మంత్రి వర్గాల్లో మంత్రిగా పని చేశారు. ఇద్దరూ సీనియర్ సభ్యులే కావడంతో ఎవరికి ప్రోటెం స్పీకర్ గౌరవం వరిస్తుందనేది ఆ పార్టీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది.అయితే వీరిలో చింతకాలయ అయ్యన్నపాత్రుడుని అసెంబ్లీ స్పీకర్‌గా ఎంపిక చేసే అవకాశం ఉందని, అసెంబ్లీ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడివైపే చంద్రబాబు కూడా మొగ్గు చూపుతున్నట్లు ఆ పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నారు. బీసీ నేతకు అసెంబ్లీ స్పీకర్ ఇస్తే బాగుంటుందన్న అభిప్రాభయంలో చంద్రబాబు ఉన్నట్లు తెలిసింది. మరో వైపు స్పీకర్ రేస్‌లో నక్కా ఆనందబాబు, కళా వెంకట్రావు పేర్లు కూడా వినిపిస్తున్నాయి. అయితే వీరిలో అయ్యన్నపాత్రుడు వైపే టీడీపీ అధిష్టానం మొగ్గు చూపుతున్నట్లు చర్చ సాగుతోంది. ఒక వేళ అయ్యన్నపాత్రుడిని అసెంబ్లీ స్పీకర్‌గా ఖరారు చేస్తే గోరంట్ల బుచ్చయ్య చౌదరిని ప్రోటెం స్పీకర్‌గా ఖరారు చేసే అవకాశం ఉంటుందనే టాక్ నడుస్తోంది.



ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
మంగళవారం 18 జూన్ 2024

# త్యాగానికి మారుపేరు బక్రీద్

## -బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి ఫరూక్




ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 17: త్యాగ నిరతికి, అల్లాహ్‌పై విశ్వాసానికి ప్రతీకగా బక్రీద్ పండుగ (ఈద్ ఉల్ ఆదా) అని న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ అన్నారు. ఈ సందర్భంగా స్థానిక భీమవరం రూట్ లో ఉన్న ఈద్గాలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలో మంత్రి ఎన్ఎండి ఫరూక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ స్వార్థం, అసూయ, రాగద్వేషాలు లేని త్యాగనిరతిని వ్యాపింపచేయడమే బక్రీద్ పండుగ ముఖ్య ఉద్దేశమని అన్ని గుణాల కన్నా దానగుణమే ఉత్తమమన్నది బక్రీద్ సారాంశం అన్నారు . ఇస్లాం ప్రవక్తల్లో ఒకరైన ఇబ్రహీం, అల్లాహ్ ఆజ్ఞను శిరసావహించి తన కుమారుడిని సైతం బలి ఇచ్చేందుకు సిద్ధం కావడాన్ని స్మరిస్తూ ప్రపంచవ్యాప్తంగా ముస్లింలు ఈ బక్రీద్ పండుగ జరుపుకుంటున్నారని గుర్తు చేశారు. ప్రవక్తల అచంచలమైన భక్తి, త్యాగ నిరతికి బక్రీద్ పండుగ అద్దం పడుతుందన్నారు. జీవితంలో ఎదురయ్యే సమస్యలకు భయపడకుండా, దేవుడిపై విశ్వాసంతో సన్మార్గంలో జీవనం సాగించాలని బక్రీద్ పండుగ మానవాళికి గొప్ప సందేశాన్ని ఇస్తుందన్నారు. తమకు



ఉన్న దాంట్లో నుంచే ఇతరులకు పంచిపెట్టడాన్ని మించిన దాతృత్వం మరొకటి లేదనే స్ఫూర్తిని చాటి చెబుతుందన్నారు. ప్రార్థన అనంతరం ఫరూక్ గారు అక్కడికి వచ్చిన ముస్లిం సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

# మంత్రి బి.సి జనార్దన్ రెడ్డి ని కలిసిన టీడీపీరాష్ట్ర కార్యదర్శి, తాతిరెడ్డి తులసి రెడ్డి



ఆంధ్ర ప్రగతి బనగానపల్లె జూన్ 17: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, తాతిరెడ్డి తులసి రెడ్డి సోమవారం నాడు బనగానపల్లె లోని గృహ నిర్మాణ మరియు రోడ్ల భవనాల శాఖ మాత్యులు బి.సి జనార్దన్ రెడ్డి స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి కి పూల బొకేలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు జ్యూవెలరీ వ్యాపార వేత, మరియు తెలుగుదేశం పార్టీ నాయకుడు అవ్వారు గౌరీనాథ్, తెలుగుదేశం పార్టీ నంద్యాల మండల కార్యదర్శి మండ్ల గుర్రప్ప, న్యాయవాది వెంకటేశ్వర్లు, మనోహర్ రెడ్డి, మరియు టిటి.ఆర్ అసోసియేట్ సభ్యులు అందరూ కలిసి గౌరవ మంత్రివర్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.

# కుందు నదిలో గుర్రపు డెక్క తొలగించాలని రైతులు విజ్ఞప్తికి స్పందించిన మంత్రి



ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ జూన్ 17: కుందు పరివాహక ప్రాంతంలో గుర్రపు డెక్క రబ్బరు చెట్లు ఏపుగా పెరిగి నీటి ప్రవాహానికి అడ్డుపడడం రైతులకు సమస్యగా మారింది గుర్రపు డెక్క రబ్బరు చెట్ల వల్ల పశువులు మనుషులకు ప్రమాదకరమని అందులో చిక్కుకుంటే తిరిగి రావడం చాలా కష్టమని అలాగే వరదల సమయంలో తూములకు అడ్డుపడి బ్రిడ్జి పై నుండి పారే ప్రమాదం ఉందని తేళ్ళాపురి గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు తులశేఈశ్వర్ రెడ్డి గ్రామ రైతులు రాష్ట్ర న్యాయ మరియు మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ దృష్టికి తీసుకొచ్చారు. స్పందించిన మంత్రి ఎన్ఎండి ఫరూక్ తేళ్ళాపురి గ్రామం వద్ద ఏపుగా పెరిగిన గుర్రపు డెక్క రబ్బరు చెట్లను పరిశీలించారు. అనంతరం నీటిపారుదల శాఖ అధికారులకు గుర్రపు డెక్క రబ్బరు చెట్లను వెంటనే తొలగించాలని సూచించడంతో హిందూ పరివాహక ప్రాంతంలో విపరీతంగా పెరిగిపోతున్న గుర్రపు డెక్క రబ్బరు చెట్లను ఖరీఫ్ సీజన్లోపు తొలగిస్తామని అధికారులు సమాధానం ఇచ్చారు మంత్రి వెంట ఆ ప్రాంతాన్ని సందర్శించిన వారిలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తాటి రెడ్డి తులసిరెడ్డి,తేళ్ళాపురి గ్రామం సర్పంచ్ తులశేశ్వర్ రెడ్డి, గోస్పాడు జిన్నా శ్రీనివాస్ రెడ్డి వీర సింహారెడ్డి, సంబరం గోపాల్ రెడ్డి,దీబగుంట్ల అధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి,దీబగుంట్ల ఎక్స్ కన్వీనర్ వేమారెడ్డి , తదితరులు పాల్గొన్నారు.

# నంద్యాల వైయస్ నగర్ నందు సొంత నిధులతో క్లిన్ అండ్ గ్రీన్

## - దేరెడ్డి శివనాగిరెడ్డి.

ఆంధ్ర ప్రగతినంద్యాల జూన్ 17: వైయస్సార్ నగర్ నందు రోడ్లు డ్రైనేజీ వ్యవస్థ సరిగలేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చినుకు పడితే రోడ్లన్నీ బురదమయం నడిచేందుకు వీలు లేనంతగా వాహనాలు వెళ్లేందుకు అవకాశం లేకుండా పెద్ద గుంతలుగా ఏర్పడ్డాయి. వర్షపు నీటిలో డ్రైనేజీ నీరు కలిసి దుర్గంధం వెదజల్లుతోంది ఇక ఖాళీ స్థలాల్లో ముళ్ల పొదలు పిచ్చి చెట్లు పెరిగి విషపురుగులకు నిలయంగా మారింది దోమల బెడద అంతా ఇంతా కాదు ఇక్కడ నివసించే ప్రజలు రోగాల బారిన పడుతూ ఆసుపత్రి పాలయ్యారు ఏ అధికారికి చెప్పినా ఏ నాయకునికి చెప్పిన మా గోడు



వినిపించుకునే నాధుడే కరువయ్యాడు ఏళ్ల తరబడి సమస్య అలాగే కొనసాగుతుంది 2024 సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో వైయస్ నగర్ కు చాయ్ పై చర్చ కార్యక్రమంలో ఎన్ఎండి ఫిరోజ్ 38వ వార్డుకు రావడం ఆ వార్డులో ఏళ్ల తరబడి ఉన్న సమస్యను తీర్చుమని ఎన్ఎండి ఫిరోజ్ ను ప్రజలు అడిగిన వెంటనే పక్కనే ఉన్న దేరెడ్డి శివనాగిరెడ్డిని సమస్యను పరిష్కరించాలని ఆదేశించడంతో 38వ వార్డు టిడిపి అధ్యక్షుడు దేరెడ్డి శివనాగిరెడ్డి టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పనులు చేయిస్తానని ఇచ్చిన మాట ప్రకారం దేరెడ్డి శివనాగిరెడ్డి తన సొంత నిధులతో రెండు జెసిబిలు 10 ట్రిప్పుల గ్రావెల్స్ రోడ్లపై అక్కడక్కడ ఉన్న గుంతలను మట్టితో పూడ్చి పనులు పూర్తి చేశారు. వైయస్ నగర్ ప్రాంతంలో కాళీ స్థలాల్లో ఉన్న కంపచెట్లను తొలగించి శుభ్రం చేయించడంతో ఆ ప్రాంత వాసులు హర్షం వ్యక్తం చేస్తూ ఎన్ఎండి ఫిరోజ్ చాయ్ పే చర్చలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఎన్ ఎండి ఫిరోజ్ కు,దేరెడ్డి శివనాగిరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# కొత్త చట్టాలపై పోలీసులకు అవగాహన కల్పించేందుకు ట్రైనింగ్ క్లాసుల నిర్వహణ.

## -జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి




ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 17: నంద్యాల జిల్లా ఎస్పీ కె.రఘువీర్ రెడ్డి కేంద్ర ప్రభుత్వం తీసుకొని వచ్చిన కొత్త చట్టాలు అనగా భారతీయ న్యాయ సంహిత అనేది రిపబ్లిక్ ఆఫ్ ఇండియాలో అధికారిక క్రిమినల్ కోడ్. ఇది బ్రిటిష్ ఇండియా కాలం నాటి ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో డిసెంబర్ 2023లో ప్రవేశపెట్టబడింది. ఇది జూలై 1, 2024 నుండి అమలులోకి వస్తుంది.కావున పోలీస్ అధికారులకు మరియు వారి సిబ్బందికి అవగాహన కల్పించేందుకు జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా ట్రైనింగ్ క్లాసులు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా నేడు జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ లలో పోలీస్ అధికారులు సిబ్బంది అనగా స్టేషన్ రైటర్, అసిస్టెంట్ రైటర్, కోర్ట్ కానిస్టేబుల్, సి సి టి ఎన్ ఎస్ కానిస్టేబుల్ అందరూ ఈ ట్రైనింగ్ క్లాసులకు హాజరయ్యే విధంగా చర్యలు తీసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ.. ఈ ట్రైనింగ్ క్లాసుల ముఖ్య ఉద్దేశం కొత్త చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ప్రతిరోజు నిర్వహించే ఈ ట్రైనింగ్ క్లాస్ లకు స్టేషన్ లోని పోలీస్ అధికారి నుండి కానిస్టేబుల్ వరకు హాజరయ్యే విధంగా ఎస్ డి పి ఓ లు ,ఇన్స్పెక్టర్లు, చర్యలు తీసుకోవాలని, ఇండియన్ పీనల్ కోడ్ స్థానంలో వచ్చిన కొత్త చట్టాల (సెక్షన్స్) గురించి ఒక చార్ట్ రూపంలో ప్రతి పోలీస్ స్టేషన్లో ఏర్పాటు చేసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ ట్రైనింగ్ క్లాస్ ల అనంతరం ప్రతి స్టేషన్ పరిధిలో ఒక పరీక్షను నిర్వహించాలని మంచి మార్కులు వచ్చిన వారికి బహుమతులు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీస్ కార్యాలయం నుండి ఎస్పీ తో పాటు అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కె.ప్రవీణ్ కుమార్ స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పిజె.వి. సంతోష్ పాల్గొన్నారు.

# నీటిముంపు బాధిత నిరుపేదలకు న్యాయం చేస్తా.

## -నంద్యాల జిల్లా కలెక్టర్ డా. శ్రీనివాసులు.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 17: శ్రీశైలం ప్రాజెక్టు క్రింద సర్వం కోల్పోయి ఆ గ్రామాల్లోనే జీవనం సాగిస్తున్న నిరుపేదలకు న్యాయం చేస్తానని నంద్యాల జిల్లా కలెక్టర్ డా. శ్రీనివాసులు హామీ ఇచ్చారు. సోమవారం మాజీ ఎమ్మెల్యే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో కొత్తపల్లి మండలం సిద్దేశ్వరం, జానాలగూడెం, బలపాలతిప్ప గ్రామాల నిరుపేదలు, చెంచు గిరిజనులు నంద్యాల జిల్లా కలెక్టర్ డా. శ్రీనివాసులును కలెక్టరేట్ లో కలిసి వినతి పత్రం అందించారు. నీటిముంపు భాదితుల సమస్యలు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి జిల్లా కలెక్టర్ కు వివరించగా పోలీస్, ఇరిగేషన్, రెవిన్యూ, పంచాయతీ రాజ్ తదితర అధికారులతో త్వరలో సమావేశం జరిపి పూర్తి వివరాలు సేకరించి నీటిముంపు గ్రామాల్లోనే గ్రామాలను నమ్ముకొని స్థిర నివాసం ఉంటున్న వారికే న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు.

# కేంద్ర కరువు బృందానికి నివేదికలు సిద్ధం చేయండి

## -టెలికాన్ఫరెన్స్లో జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు.

ఆంధ్ర ప్రగతి నంద్యాల, జూన్ 17: జూన్ నెల 20వ తేదీ కేంద్ర కరువు బృందం జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో కరువుకు సంబంధించి 12 మండలాల్లో జరిగిన నష్టాన్ని స్పష్టంగా, అర్థమయ్యే రీతిలో వివరించేందుకు నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కరువు బృంద పరిశీలకుల పర్యటనపై జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి సంబంధిత అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ గత రబీలో 12 మండలాల్లో నెలకొన్న కరువు పరిస్థితులను తెలుసుకునే నిమిత్తం కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఇంటర్ మినిస్టీరియల్ టీం ఈనెల 20 తేదీ జిల్లాలోని ఉయ్యాలవాడ, దొర్నిపాడు, కోవెలకుంట్ల మండలాల్లో పర్యటిస్తుందన్నారు. ప్రధానంగా దెబ్బతిన్న పంటలకు సంబంధించి స్పష్టమైన రీతిలో మండలానికి నాలుగైదు ఫోటోలతో పాటు నివేదికలు కూడ సిద్ధం చేయాలని జిల్లా వ్యవసాయ అధికారిని ఆదేశించారు.



అలాగే పశుగ్రాస కొరతపై పశుసంవర్ధక శాఖ, ప్రకటించిన కరువు మండలాల్లో కూలీలకు కల్పించిన పనులపై డ్వామా, గ్రామాలలో నీటి రవాణాపై గ్రామీణ నీటి సరఫరా, నీటి లభ్యతను బట్టి రబీలో సాగుకు సరఫరా చేసిన సాగునీటి వివరాలను ఇరిగేషన్, భూగర్భ జల శాఖలకు సంబంధించిన అధికారులు నివేదికలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించేందుకు సిద్ధంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. సంబంధిత మండలాల్లో దెబ్బతిన్న పంటలు, తాగునీరు, సాగునీరు సమస్యలు తదితర కరువుకు సంబంధించిన స్పష్టమైన ఫోటోలను ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా ప్రదర్శించాలన్నారు. రైతులతో ముఖాముఖి, ఇతర అనుబంధ శాఖల అధికారులతో సమన్వయం, రూట్మ్యాప్ తదితర అంశాలపై నివేదికలు తయారుచేసి మంగళవారం ఉదయం జరిగే సమావేశానికి తీసుకురావాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కేంద్ర బృంద సభ్యుల వివరాలు, వారికి కేటాయించిన లైజన్ అధికారులు కూడా కరువు పరిస్థితులపై పూర్తిస్థాయి అవగాహన ఉండి బృందానికి వివరించేలా సిద్ధంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

ఈ టెలి కాన్ఫెరెన్సులో జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డి, డిఆర్ఓ పద్మజ, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ఇంటర్ విద్యార్థులకు తీపికబురు..!

**-ఈ ఏడాది నుంచే ఉచిత పాఠ్య, నోట్ పుస్తకాలు పంపిణీ.**

**-విద్య శాఖ మంత్రి నారా లోకేష్ ఆదేశం.**

ఆంధ్ర ప్రగతి అమరావతి జూన్ 17 : ఏపీలో నూతనంగా ఏర్పడిన చంద్రబాబు ప్రభుత్వం విద్యాశాఖపై దృష్టి సారించింది. మానవ వనరులు, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ మంత్రి మంత్రి నారా లోకేష్ నేడు సమీక్ష నిర్వహించారు. డ్రాప్ అవుట్స్, మౌలిక సదుపాయాలపై ఉన్నతాధికారులతో సమీక్ష చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనం నాణ్యత విషయంపై అధికారులను ఆరా తీశారు. మధ్యాహ్న భోజనం రుచిగా, నాణ్యతతో ఉండేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమగ్ర నివేదిక ఇవ్వాల్సిందిగా ఆదేశించారు. పాఠశాలల్లో పారిశుధ్యం నిర్వహణకు సంబంధించి ఢిల్లీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, ఇతర రాష్ట్రాల్లో విధానాలను అధ్యయనం చేయాలని అధికారులకు లోకేష్ సూచించారు. గత బడిలో చేరి మధ్యలో మానేసిన జనరల్ డ్రాప్ అవుట్స్ వివరాలు కూడా అందజేయాలని స్పష్టం చేశారు. ఆయా గ్రామాల్లో విద్యార్థులకు పాఠశాల ఎంత దూరంలో అందుబాటులో ఉంది అనే వివరాలతో నివేదిక రూపొందించాలని కోరారు. గత ఐదేళ్లలో ఎన్ని పాఠశాలలు మూతపడ్డాయి, అందుకు గల కారణాలను కూడా తెలియజేయాలని అన్నారు.

దేశంలోనే బెస్ట్ లైబ్రరీ మోడల్ ఎక్కడ ఉందో తెలుసుకుని, సమీక్ష చేసి అందుకు సంబంధించిన నోట్‌ను కూడా అందజేయాలని లైబ్రరీస్ డైరెక్టర్‌ను ఆదేశించారు. బైజూస్ కంటెంట్, ఐఎఫ్ బీ వినియోగం మీద సమగ్ర నోట్ ను సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. సీబీఎస్ఈ పాఠశాలల మీద సమగ్ర నోట్ తో పాటు ఈ ఏడాది పదో తరగతి పరీక్షలు రాయబోయే 82 వేల మంది విద్యార్థులకు సంబంధించి ఏం చర్యలు తీసుకున్నారు, అదే విధంగా ఈ ఏడాది కాలంలో విద్యార్థులకు ఏ రకమైన శిక్షణ ఇవ్వాలో సమగ్ర నోట్ ఇవ్వాలని మంత్రి లోకేశ్ అధికారులకు నిర్దేశించారు. ఈ సమావేశంలో పాఠశాల విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాశ్, బోర్డ్ ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ కమిషనర్ సౌరభ్ గౌర్, స్కూల్ ఇన్ ఫ్రా కమిషనర్ భాస్కర్ కాటమనేని, స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు, మధ్యాహ్న భోజన పథకం డైరెక్టర్ అంబేద్కర్, వయోజన విద్య డైరెక్టర్ శ్రీమతి నిధి మీనా, పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ ప్రసన్నకుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



# స్వాతంత్ర్యసమరయోధురాలు శ్రీమతి ఝాన్సీలక్ష్మీబాయి సేవలు చిరస్మరణీయం

## -సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫీ.



ఆంధ్ర ప్రగతి డోన్ జూన్ 17: జూన్ 17 న మన భారత స్వాతంత్ర్య సమరయోధురాలు శ్రీమతి ఝాన్సీ లక్ష్మీబాయి వర్ధంతి సందర్భంగా
డోన్ పట్టణం లో సామాజిక కార్యకర్త పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యం లో శ్రీమతి ఝాన్సీ లక్ష్మిభాయి వర్ధంతి సందర్భంగా ఆమె చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు వారిని స్మరించుకున్నారు ఈ కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ.. మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి పేర్కొన్నారు.శ్రీమతి ఝాన్సీ లక్ష్మీబాయి అసలు పేరు మణికర్ణిక. ఆమె 1828 వ సంవత్సరము నవంబరు 19 న జన్మించారు. ఈమె తల్లిదండ్రులు మోరోపంత్ తాంబే మరియు భాగీరథీబాయి. వీళ్ళది సాంప్రదాయ బ్రాహ్మణ కుటుంబం. ఆధ్యాత్మిక ధోరణి మెండుగా కలది.ఆమె తల్లి రాణి నాలుగేళ్ళ ప్రాయంలో ఉండగానే కన్ను మూసింది. 1857లో ఆంగ్లేయుల పరిపాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి భారత స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించింది. భారతదేశంలోని బ్రిటిష్ పరిపాలనలో ఝాన్సీకి రాణిగా ప్రసిద్ధికెక్కినది.1857 లో భారత దేశ తిరుగుబాటుదార్లలో ముఖ్యమైన వాళ్ళలో రాణి ఒకరు. భారతదేశ చరిత్రలో ఒక గొప్ప వ్యక్తిగా నిలిచిపోయిన వీరనారి. ఈమె యుద్ధం లోనె 1858 జూన్ 17 లో వీర స్వర్గం పొందారు. ఝాన్సీ రాణీ ధైర్యసాహసాల వల్ల అనేక మంది మహిళలు స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొనుటకు మార్గం చూపిన వీర వనిత. దాని వల్లనే ఆమె భారత స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవడమే కాక 19వ శతాబ్దంలో మహిళా సాధికారతకు ఆదర్శ ప్రాయంగా నిలిచింది.మన దేశ స్వాతంత్ర్య సమరయోధుల అడుగుజాడల్లో నడవాలని ప్రతి స్త్రీమూర్తి ఝాన్సీలక్ష్మీభాయి ని ఆదర్శంగా తీసుకోవాలని సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి కోరారు.

# నూతన ఉపాధి పనులకు మోక్షం ఎన్నడో....?


## -గత ఆరు నెలలుగా ఉపాధి లేక అవస్థలు పడుతున్న కూలీలు



ఆంధ్ర ప్రగతి బండి ఆత్మకూరు జూన్ 17: ప్రతి సంవత్సరం ఏప్రిల్ ఒకటి నుండి ప్రతి జతకు 100 కూలీలు ఉపాధి పనులు ఉండేవి. ఉపాధి పని ద్వారా వచ్చే కూలి ద్వారా చాలామంది పేద,మధ్యతరగతి కూలీలు జీవనం చేసుకునేవారు. గత ఆరు నెలలుగా ఎలాంటి పనులు లేకపోవడంతో ఏప్రిల్ ఒకటికి ప్రారంభం కావలసిన నూతన ఉపాధి పనులు మంజూరు కాకపోవడంతో నంద్యాల జిల్లాలోని చాలా మండలాల్లో ఉపాధి లేక చాలామంది పేదలు పస్తులు ఉంటున్నారు. కొంతమంది నిరుపేదలు పట్టణాలలోని హొటలలో పనులు చేసుకుంటూ కాలం గడుపుతున్నారు. అదే గ్రామాల్లో వంద రోజులు ఉపాధి పని కల్పిస్తే దాదాపు ఒక కుటుంబానికి 20 నుండి 25 వేల రూపాయలు వస్తాయి. ఉపాధి పనులు లేకపోవడంతో ఎక్కడికో వెళ్లి పనులు చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ విషయంపై అధికారులను ప్రశ్నిస్తే పనులు మంజూరు కాలేదని సమాధానం తప్ప ఏమి చేయలేని నిస్సహాయ స్థితి. మొన్నటి వరకు ఎలక్షన్ కోడ్ ఉన్నదని కొత్త పనుల మంజూరు కోసం ఎలక్షన్ కమిషన్కు పంపామని జిల్లా అధికారులు చెప్పుకొచ్చారు. కానీ ఎలక్షన్ కోడ్ పోయి చాలా రోజులైనా జిల్లా అధికారులు మాత్రం నూతన పనులకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం లేదు. ఎప్పటికైనా నంద్యాల జిల్లా కలెక్టర్ ఈ సమస్యపై దృష్టి సారించి నూతన పనులను మంజూరు చేస్తే పేద మధ్యతరగతి ప్రజల కుటుంబాలు జీవనం కుదుటగా ఉంటుంది. ముఖ్యంగా ఒక నెల రోజుల్లో రైతులకు వ్యవసాయ పనులు ప్రారంభమవుతాయి. ఇప్పటివరకు రైతులకు కావలసిన వంటకాలువలను చేయకపోవడంతో రైతులు కూడా ఆందోళన చెందుతున్నారు. ప్రతి సంవత్సరం జూన్ జూలై మాసాల్లో ఉపాధి పనుల కింద వ్యవసాయ పంట కాలువలను పనులు చేపట్టేవారు. ఈ సంవత్సరం ఆ ఊసే లేకపోవడంతో వేలాది రూపాయలు ఖర్చుపెట్టి కాలువలు చేయించుకోవాలని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన మంజూరు చేసి రైతులను కూడా ఆదుకోవాలి. ఇప్పటికైనా నూతన ఉపాధి పనులను మంజూరు చేస్తారని ఆశిద్దాం.

# చంద్రబాబు సీఎం అయ్యాకే పుట్టింటికి వచ్చిన మహిళ.!

- -ఐదేళ్ల క్రితం అక్క కొడుకుతో రాజకీయంగా విభేదం.
- -చంద్రబాబు మళ్లీ సీఎం అయ్యాకే వస్తానన శపథం.
- -ఐదేళ్ల పాటు పుట్టింట్లో జరిగిన అన్ని కార్యక్రమాలకు దూరం.
- -నిన్న స్వగ్రామానికి వచ్చిన విజయలక్ష్మి.
- -బంధువులు, గ్రామస్థులు, టీడీపీ కార్యకర్తల ఘన స్వాగతం. ఎన్టీఆర్ విగ్రహానికి నివాళి



ఆంధ్ర ప్రగతి ఎన్టీఆర్ జిల్లా జూన్ 17: టీడీపీ అధినేత. చంద్రబాబునాయుడు మళ్లీ ముఖ్యమంత్రి అయ్యాకే పుట్టింట్లో అడుగుపెడతానని భీష్మించిన ఓ మహిళ అనుకున్నట్టే ఐదేళ్ల తర్వాత కన్నవారి ఇంటికి చేరుకుంది. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం కేశవాపురానికి చెందిన విజయలక్ష్మికి కృష్ణా జిల్లా జగ్గయ్యపేట మండలం గరికపాడుకు చెందిన పెదనాటి నర్సింహారావుతో వివాహమైంది. ఐదేళ్ల క్రితం తన ఇద్దరు కుమారులతో కలిసి కేశవాపురంలోని సోదరి ఇంటికి వచ్చారు. మాటల సందర్భంగా వచ్చేసారి చంద్రబాబే సీఎం అవుతారని విజయలక్ష్మి, జగనే మళ్లీ అధికారంలోకి వస్తారని అక్క కొడుకు ప్రసాద్ మధ్య వాదోపవాదాలు జరిగాయి.ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. చంద్రబాబు సీఎం అయ్యాకే మళ్లీ ఊళ్లో అడుగుపెడతానని సవాలు చేశారు. ఆ తర్వాత తిరిగి ఇంటికి వెళ్లిపోయిన ఆమె ఐదేళ్లపాటు పుట్టింట్లో జరిగిన ఏ కార్యక్రమానికీ హాజరు కాలేదు. తాజా ఎన్నికల్లో టీడీపీ గెలిచి, ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేయడంతో విజయలక్ష్మి శనివారం స్వగ్రామానికి వచ్చారు. పంతం పట్టి చంద్రబాబు సీఎం అయ్యాక గ్రామానికి వచ్చిన విజయలక్ష్మికి కుటుంబ సభ్యులే కాదు, గ్రామస్థులు, టీడీపీ అభిమానులు స్వాగతం పలికారు. బస్టాండ్ వద్దనున్న ఎన్టీఆర్ విగ్రహానికి విజయలక్ష్మి నివాళులు అర్పించి ఇంటికి వెళ్లారు.

# జగన్ శాపం వల్లనే పోలవరానికి ఈ దుస్థితి ..!

(మొదటి పేజి తరువాయి)

చంద్రబాబు. పోలవరంను విభజన చట్టంలో జాతీయ ప్రాజెక్ట్ చేర్చడంతో 2014-2019లో అధికారంలో ఉన్న టీడీపీ హయాంలోనే 72 శాతం పనులు పూర్తి చేశామని వెల్లడించారు. "పోలవరం కోసం నేను పడిన కష్టాన్ని జగన్ బూడిలో పోసిన పన్నీరులా మార్చారు. ఈ ప్రాజెక్ట్కు ఆటంకాలు రాకూడదన్న ఉద్దేశంతోనే తెలంగాణలోని ఏడు మండలాలను ఆంధ్రలో విలీనం చేసేలా ఆనాడు కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించాను. ప్రాజెక్ట్ ప్రారంభం నుంచి ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. కానీ వేటికీ తలొగ్గకుండా ముందుకు సాగాం. కానీ ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ దుస్థితిని చూస్తుంటే గుండె తరుక్కుపోతుంది. చంద్రబాబు.
మా హయాంలోనే 72 శాతం ప్రాజెక్ట్ పూర్తయింది. అప్పుడే స్పిల్ వేపై 15 లక్షల క్యూసెక్కుల నీరు డిశ్చార్జ్ అయ్యాయి" అని చెప్పారు.రాజకీయాల్లో ఉండటానికి ఎటువంటి అర్హత లేని వ్యక్తి అధికారంలోకి వచ్చి రాష్ట్రానికి శాపంలా మారారు. అధికారంలోకి వచ్చీరాగానే రివర్స్ టెండరింగ్ చేపట్టింది వైసీపీ ప్రభుత్వం. ఏజెన్సీలతో పాటు సిబ్బందిని కూడా మార్చారు. డయాఫ్రమ్ వాల్ గత ప్రభుత్వం ఏమాత్రం కాపాడుకోలేదు. పూర్తి నిర్లక్ష్యం చేసింది. పోలవరం ప్రాజెక్ట్ విషయంలో జగన్ చేసిన తప్పులన్నీ క్షమించరానివే. ఈ ప్రాజెక్ట్పై వందల సారలు సమీక్ష నిర్వహించా. ఇప్పుడు ఈ ప్రాజెక్ట్ దుస్థితి అత్యంత దుర్భరంగా మారింది. రూ.446 కోట్లతో మరమ్మతులు చేయించినా బాగుపడుతుందన్న గ్యారెంటీ లేదు. సమాంతరంగా డయాఫ్రమ్ వాల్ కడితే రూ.990 కోట్లు ఖర్చవుతుంది. గతంలో చేపట్టిన ప్రాజెక్ట్ నిర్మాణం అంతరాయం లేకుండా కొనసాగి ఉంటే 2020 చివరికి పూర్తయి ఉండేది. కానీ ఇప్పుడు అన్నీ సవ్యంగా జరిగితేనే పోలవరం పూర్తికి మరో నాలుగేళ్లు పడుతుందని అధికారులు చెప్తున్నారు" అని వివరించారు.వేల కోట్ల రూపాయలు వృథా అయ్యాయి. ఎలాంటి వ్యక్తి రాజకీయాల్లో ఉండకూడదు అనడానికి ఇది ఒక కేస్ స్టడీ. మా ప్రభుత్వం ఆపిన దగ్గర నుంచి అధికారంలోకి వచ్చినప్పటి నుంచే ప్రాజెక్ట్కు కొనసాగించి ఉంటే అతి తక్కువ ఖర్చుతో ప్రాజెక్ట్ పూర్తయి ఉండేది. కానీ అలా చేయకపోవడంతో ఇప్పుడు ప్రాజెక్ట్ వ్యయం భారీగా పెరిగింది. ప్రాజెక్ట్కు నష్టం తీసుకొచ్చిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఏజెన్సీని మార్చొద్దని కేంద్రప్రభుత్వం అప్పుడే చెప్పింది. కానీ కేంద్రం మాటలను రాష్ట్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టింది. అలా ఏజెన్సీని మార్చడం వల్లే ప్రాజెక్ట్ ఆలస్యమైంది. దీనికి బాధ్యత ఎవరు తీసుకుంటారు? అధికారంలో ఉన్న ఐదేళ్ల పాటు వైసీపీ ఎవరూ ఇక్కడి రాకుండా జాగ్రత్తలు తీసుకుంది. ప్రజలు, మీడియా, ప్రతిపక్ష నేతగా నన్ను ఇక్కడి రాకుండా అధికార బలంతో అడ్డుకుంది" అని చెప్పుకొచ్చారు.చాలా సాఫీగా సాగిన ప్రాజెక్ట్ ఇప్పుడు అత్యంత క్లిష్టంగా మారింది. ప్రాజెక్ట్ విషయంలో ఏర్పడిన అన్ని చిక్కుముడులను విప్పే ప్రయత్నం చేస్తున్నాం. ఈ ప్రాజెక్ట్ ద్వారా నధుల అనుసంధానం చేసి రాష్ట్రంలోని ప్రతి ఎకరాకు నీళ్లు అందించాలని ఎన్నో కలలు కన్నా. కానీ అవన్నీ ఇప్పుడు చెల్లాచెదులు అయిపోయాయి. మళ్లీ పోలవరం సవ్యంగా మార్చడమే ప్రథమ లక్ష్యంగా పెట్టుకుంటున్నా. ఇది ఒక పార్టీకి, ఒక వర్గానికి సంబంధించిన ప్రాజెక్ట్ కాదు. రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి సంబంధించిన ప్రాజెక్ట్ ఇది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ప్రతి ఆంధ్రుడికి లాభం చేకూరుతుంది" అని చంద్రబాబు తెలిపారు.రాష్ట్రంలో కరువు ఉండకూడదన్న లక్ష్య సాధన కోసం పోలవరం ప్రాజెక్ట్ను ముందుకు తీసుకెళ్లాం. కానీ 2005లో అప్పటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి.. ఈ ప్రాజెక్ట్ను ప్రారంభించిన సమయంలోనే అనేక అవకతవకలు జరిగాయి. దాంతో కాంట్రాక్టర్లు తమ కాంట్రాక్ట్లను రద్దు చేసుకున్నారు. ఆ కారణంగా ఈ ప్రాజెక్ట్ అటకెక్కింది. భూ సేకరణ, కుడి.. ఎడమ కాల్వల నిర్మాణాల విషయాల్లో కోర్టులకు వెల్లడంతో ప్రాజెక్ట్ మరింత ఆలస్యం అయింది. ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఉత్తరాంధ్ర, కోస్తాంధ్రతో పాటు రాయలసీమ రైతులు కూడా గోదావరి నీళ్లు వాడుకోవచ్చు. తద్వారా రాష్ట్రంలోని ఏ ప్రాంతంలో కూడా కరవు అనే మాట వినిపించకుండా చేయొచ్చు. కానీ ఇప్పుడు అంతా తలకిందులైంది. ప్రాజెక్ట్ అంతా దారుణంగా తయారయింది" అని అన్నారు

# ఆశా కార్యకర్తలతో అదనపు పనులు చేయించరాదు




ఆంధ్ర ప్రగతి నంద్యాల జూన్ 17: నంద్యాల జిల్లా ఆశా వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం జి నాగమణి అధ్యక్షతన సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగినది. ఈ సమావేశంలో ముఖ్య అతిథులుగా హాజరైన జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వి . యేసు రత్నం ఏ నాగరాజు ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శ జి. రమణకుమారి మాట్లాడుతూ ఆశా కార్యకర్తలతో నేటికీ అదనపు పనులు చేయిస్తున్నారని అదనపు పనులు చేయరాదనే ప్రభుత్వం సర్కులర్ ఇచ్చిన అది అమలు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా ఉన్నారని వారు అన్నారు. ఆశ కార్యకర్తలకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని ఉద్యోగ భద్రత కల్పించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరుకోరారు. ఆశా కార్యకర్తకు ప్రభుత్వ సెలవులు మెడికల్ లీవులు మేటర్నిటీ లీవులు ప్రభుత్వం మంజూరు చేయాలి. ఆశా కార్యకర్తలకు కొత్తగా సెల్ ఫోన్లు ఇచ్చి 5జి సిమ్ములు ఇవ్వాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రోజురోజుకు పెరుగుతున్న ధరలతో ఆశా కార్యకర్తల కుటుంబాల పోషణ కష్టంగా ఉందని పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ప్రమాద బీమా సౌకర్యం కల్పించి వయో పరిమితి పెంచాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆశా కార్యకర్తలు విధి నిర్వహణలో మరణించిన వర్కర్స్ కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని గత ప్రభుత్వం అంగీకరించింది అలాగే మట్టి ఖర్చులకు 20 వేల రూపాయలు ఇస్తామని అంగీకరించింది కానీ అమలు చేయడం లేదని పోస్టులను భర్తీ చేస్తూ రాజకీయ జోక్యం లేకుండా చేస్తామని గత ప్రభుత్వం అంగీకరించింది ఈ సమస్యల సాధన కోసం కొత్త ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఆశ వర్కర్స్ సమస్యల పరిష్కారం కోసం యూనియన్ నాయకులు మరియు డీఎంహెచ్వో తో రెండు నెలలకు ఒకసారి జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని వారు కోరారు. ఆశా వర్కర్స్ రాసే రికార్డులను ప్రభుత్వమే ఉచితంగా సరఫరా చేయాలని వారు కోరారు. నేడు కొత్తగా వచ్చిన టిడిపి ప్రభుత్వం ఆశ వర్కర్ల యొక్క సమస్యలు పరిష్కరిస్తామని వారికి అండగా ఉంటామని వాగ్దానం చేసింది ఆ వాగ్దానాన్ని టిడిపి ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని వారు కోరారు. ఈ సమావేశంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి బాల వెంకట్ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు ప్రభావతి నాగలక్ష్మి చెన్నమ్మ సరస్వతి కృపావతి సుమలత శివలక్ష్మి నాగస్వాములమ్మ జయమ్మ మారెమ్మ లక్ష్మీదేవి విజయమ్మ రాజేశ్వరి ఈశ్వరమ్మ చిన్నమ్మ లక్ష్మీదేవి పద్మావతి సరస్వతి ఈ సమావేశంలో పాల్గొన్నారు.